**238వ అధ్యాయం**

## ٢٣٨ - بَابُ فَضْلِ الْمَمْلُوكِ الَّذِي يُؤَدِّي

## దేవుని హక్కుతోపాటు తన యజమాని హక్కుల్ని కూడా పాటించే బానిస

١٣٦٣ - عَنِ ابنِ عُمَرَ، رَضِيَ اللهُ عَنْهُما، أَنَّ رسُولَ اللهِ ﷺ قالَ: «إِنَّ العَبْدَ إذا نَصَحَ لِسَيِّدِهِ، وَأَحْسَنَ عِبادَةَ اللهِ، فَلَهُ أَجْرُهُ مَرَّتَيْنِ» مُتَّفَقٌ عليهِ.

1363. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: బానిస గనక ఒకవైపు తన యజమాని బాగోగుల్ని పట్టించుకుంటూ మరోవైపు దైవాన్ని అత్యుత్తమ రీతిలో ఆరాధిస్తే అతనికి రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది.

(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని బానిస విమోచన ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ప్రమాణాల ప్రకరణం)*

١٣٦٤ - وَعَنْ أَبي هُرَيرَةَ، رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لِلْعَبْدِ الْمَمْلُوكِ الْمُصْلِح أَجْرَانِ» وَالَّذي نَفسُ أَبي هُرَيرَةَ بِيَدِهِ لَوْلا الجِهادُ في سَبيلِ اللهِ، وَالحَجُّ، وَبِرُّ أُمِّي، لأَحْبَبْتُ أَنْ أَمُوتَ وَأَنَا مَمْلوكٌ. مُتَّفَقٌ عليهِ.

1364. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఒకవైపు యజమాని శ్రేయాన్ని కోరుకుంటూ మరోవైపు దైవాన్ని ఆరాధించే బానిసకు రెట్టింపు పుణ్యం లభిస్తుంది.

ఆ తర్వాత అబూహురైరా (రజి) ఇలా అన్నారు: ఎవరి చేతుల్లోనయితే నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెప్తున్నాను. దైవమార్గంలో జిహాద్ చేసే, హజ్‌యాత్ర చేసే, ఇంకా నా తల్లిని పోషించుకొనే బాధ్యతలే గనక నా

మీద లేకపోతే నేను కూడా ఒక బానిసగా మరణించటానికి ఇష్టపడే వాణ్ణి. (బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని బానిస విమోచన ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ప్రమాణాల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

నాగరిక జీవనానికి అలవాటుపడ్డ ఆధునికులు బానిసత్వ జీవితాన్ని ఊహించు కోవటానికయినా ఇష్టపడరు. అలాంటి బానిస వ్యవస్థను ఇస్లాం ధర్మం ఎలా తల్లక్రిందులు చేసిందో చూడండి. ఒక స్వేచ్ఛాజీవి తనకు తానుగా బానిస జీవితాన్ని అనుభవించటానికి ఉవ్విళ్లూరుతున్నాడంటే అప్పటికి ఇస్లాం దాని రూపురేఖల్ని ఎంతగా మార్చివేసిందో ఊహించటం కష్టం కాదు. ఒకప్పుడు బానిసత్వ వ్యవస్థలో తన యజమానుల చేత దారుణమైన శిక్షలు అనుభవించి మక్కాపురవీధుల్లో మలమలమాడే ఇసుకమీద నగ్నంగా ఈడ్వబడి చిత్రహింసలు సహించిన నీగ్రో జాతివారైన బిలాల్ (రజి)ని అనతికాలంలోనే అదే పవిత్ర మక్కానగరంలో ప్రతిష్ఠాలయమైన కాబా గృహ పైకప్పు మీద నించొని నమాజు గురించి ప్రకటించే హోదాను కల్పించి జాత్యహంకారంతో విర్రవీగుతున్న మక్కా సర్దారులను సైతం ముక్కున వేలేసుకునేలా చేసింది ఇస్లాం. అలాంటి ఇస్లాం ధర్మం బానిసత్వ వ్యవస్థని కాపాడుకుంటూ వస్తోందని విమర్శించటం తగునండీ?!

1365. హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఒక బానిస తన ప్రభువును (అంటే దేవుణ్ణి) అత్యుత్తమంగా ఆరాధిస్తూ (మరోవైపు) తనమీద తన యజమానికున్న హక్కుని నెరవేరుస్తూ, అతని బాగుని కోరుతూ అతనికి విధేయత చూపినట్లయితే- అలాంటి బానిసకు రెట్టింపు పుణ్యం లభిస్తుంది. (బుఖారీ)

١٣٦٥ - وَعَنْ أَبِي مُوسَى الأَشْعَرِيِّ، رَضِيَ اللهُ عَنْهُ قالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «المَمْلُوكُ الَّذي يُحْسِنُ عِبَادَةَ رَبِّهِ، وَيُؤَدِّي إلى سَيِّدِهِ الذي عليهِ مِنَ الحَقِّ، وَالنَّصيحَةِ، وَالطَّاعَةِ، لهُ أَجْرَانِ» رواهُ البخاريُّ.

(సహీహ్ బుఖారీలోని బానిస విమోచన ప్రకరణం)

1366. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) గారే చేసిన మరొక కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా

١٣٦٦ - وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «ثلاثَةٌ لهُمْ أَجْرَانِ: رَجُلٌ

مِنْ أَهْلِ الكِتابِ آمَنَ بِنَبِيِّهِ، وَآمَنَ بِمُحَمَّدٍ، وَالعَبْدُ المَمْلُوكُ إذا أَدَّى حَقَّ اللهِ، وَحَقَّ مَوَالِيهِ، وَرَجُلٌ كانَتْ لَهُ أَمَةٌ فَأَدَّبَها فَأَحْسَنَ تَأْدِيبَهَا، وَعَلَّمَها فَأَحْسَنَ تَعْلِيمَهَا، ثُمَّ أَعْتَقَهَا فَتَزَوَّجَهَا، فَلَهُ أَجْرَانِ» مُتَّفَقٌ عليهِ.

ప్రవచించారు: ముగ్గురికి రెట్టింపు పుణ్యం లభిస్తుంది. ఒకరు: తమ ప్రవక్తను విశ్వసించటంతోపాటు ముహమ్మద్ (సల్లం)ను కూడా విశ్వసించిన గ్రంథవహులకు చెందిన వ్యక్తి. రెండవ వ్యక్తి; దేవుని హక్కుతో పాటు తన యజమాని హక్కుని కూడా నిర్వర్తించే పరాధీనుడైన బానిస. మూడో వ్యక్తి: తన దగ్గరున్న ఒక బానిసరాలికి ఉత్తమ సంస్కారాన్ని, శిక్షణ, మంచి విద్యాబుద్ధులు నేర్పి, ఆ తర్వాత ఆమెకు స్వేచ్ఛనొసగి ఆమెను వివాహం చేసుకున్నవాడు. ఇలాంటివారికి రెండింతల పుణ్యం లభిస్తుంది. (బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని విద్యాప్రకరణం - సహీహ్ ముస్లింలోని విశ్వాస ప్రకరణం)

## ముఖ్యాంశాలు

1) గ్రంథవహులంటే యూదులు, క్రైస్తవులని భావం. వారు గనక ఇస్లాం స్వీకరిస్తే వారికి రెండింతల పుణ్యం లభిస్తుందని ఈ హదీసులో చెప్పబడింది. 2) అదే విధంగా శ్రేయోభిలాషి అయిన బానిస కూడా రెట్టింపు పుణ్యానికి అర్హుడౌతాడు. ఎందుకంటే అతను తన యజమానికి విధేయత చూపుతాడు. అందులో ఎదురయ్యే ఇబ్బందుల్ని ఓర్చుకుంటాడు. మరోవైపు దేవుని ఆరాధనా హక్కుని కూడా ఉత్తమరీతిలో నెరవేరుస్తాడు. అయితే ఇక్కడ మనం తెలుసుకోవాల్సిన విషయం ఒకటుంది. బానిస ప్రతి విషయంలోనూ తన యజమానికి విధేయత చూపనవసరం లేదు. యజమాని గనక దైవాభీష్టానికి వ్యతిరేకమైన ఆజ్ఞలు ఇస్తే అలాంటి సందర్భాల్లో తమ యజమానులకు ఎదురుతిరగటాన్ని బానిసలు తమ విధిగా భావించాలని ఇస్లాం ధర్మం ప్రబోధించింది. 3) పోతే రెట్టింపు పుణ్యం పొందగలిగే మూడో వ్యక్తి- తన దగ్గర ఒకే ఒక బానిసరాలుండి ఆమెకు ఉన్నత విద్యాబుద్ధులు గరిపి తర్వాత ఆమెకు బానిసత్వం నుండి స్వేచ్ఛనొసగి తనే ఆమెను పెళ్ళాడినవాడు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఒక బానిసరాలికి స్వేచ్ఛనొసగిన తర్వాత ఆమెను వివాహమాడాలంటే ముందుగా ఆమెకు మహర్ ధనం ఇవ్వవలసి ఉంటుంది. అంతేకాదు, ఒక స్వేచ్ఛాపరురాలైన భార్యకు ఎలాంటి హక్కులుంటాయో ఆమెకు కూడా అలాంటి హక్కులు ఉంటాయి. ఆమె మాజీ యజమాని, ప్రస్తుతం భర్తయినవాడు ఆ హక్కులన్నిటినీ నెరవేర్చవలసి ఉంటుంది.